నిర్లక్ష్యంతో అగ్గి.. అంతా బుగ్గి

- వేసవిలో ముందు జాగ్రత్తలే శ్రీరామరక్ష
- క్లస్టర్ పరిధిలో ఏడాదిగా 85 ప్రమాదాలు
- అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ



రాయవరంలో ట్రాక్టర్ ట్రక్కులో కాలిపోతున్న గడ్డి (ఫైల్)



అగ్నిమాపక శకటం

రాయవరం: ఎండా కాలం మండించే కాలం.. అధిక ఉష్ణోగ్రతలతో ఏదో చోట అగ్ని ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. విద్యుదాఘాతం, సిగరెట్, చుట్ట, బీడీ కాల్చి ఆర్పివేయకుండా పడేయడంతో కూడా ప్రమాదాలు జరుగుతుంటాయి. ప్రకృతి వైపరీత్యాలతో జరిగే అగ్ని ప్రమాదాలను పక్కన పెడితే మానవ తప్పిదాలతో సంభవించే ప్రమాదాలే అధికమని అగ్నిమాపక శాఖ అధికారులు పేర్కొంటున్నారు. వేసవిలో అజాగ్రత్తగా ఉంటే అగ్ని ప్రమాదాలు జరిగే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. వీటిని ముందు జాగ్రత్తలతో అరికట్టవచ్చు. తద్వారా నష్టాన్ని నివారించవచ్చని అగ్నిమాపక, విపత్తుల నివారణ శాఖ అధికారులు చెబుతున్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకూ రామచంద్రపురం, మండపేట అగ్నిమాపక కార్యాలయాలకు 85 అగ్ని ప్రమాద కాల్స్ వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదాల్లో రూ.43.90 లక్షల నష్టం సంభవించగా, రూ.1.22 కోట్ల మేర ఆస్తిని కాపాడగలిగినట్లు ఫైర్ స్టేషన్ అధికారులు వివరించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు వెంటనే అగ్నిమాపక కార్యాలయానికి ఫోన్ చేయడం వల్ల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించే వీలుంటుంది. ఇదిలా ఉంటే మండపేట అగ్నిమాపక కేంద్రం పరిధిలోకి మండపేట, కపిలేశ్వరపురం మండలాలు పూర్తిగా, ఆలమూరు, రాయవరం మండలాల పరిధిలోని కొన్ని గ్రామాలు వస్తాయి. రామచంద్రపురం అగ్నిమాపక కేంద్రం పరిధిలోకి రామచంద్రపురం, కె.గంగవరం మండలాలతో పాటు రాయవరం, పెదపూడి, కరప, కాజులూరు, తాళ్లరేవు మండలాల్లోని కొన్ని గ్రామాలు వస్తాయి.

ఇలా చేద్దాం.. జాగ్రత్తలు పాటిద్దాం

వంట గ్యాస్ వాడకం తర్వాత రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలి. బయట నుంచి ఇంట్లోకి వచ్చినప్పుడు గ్యాస్ వాసన వస్తే లైట్లు, ఫ్యాన్ వేయడం వంటివి చేయరాదు. వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించాలి. సిగరెట్, చుట్ట, బీడీ వెలిగించిన వారు పడేసేటప్పుడు పూర్తిగా ఆర్పివేయాలి. ఇళ్లను వదిలి వెళ్లే వారు కరెంట్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలి. దీంతో వేడికి తీగలు షార్ట్ సర్క్యూట్ అయినా విద్యుత్ ఇంట్లోకి ప్రవేశించకుండా ఉంటుంది. వంట చేసే మహిళలు కాటన్ దుస్తులను ధరించాలి. అగ్గి పెట్టెలు, లైటర్లు, కిరోసిన్ దీపాల నుంచి చిన్నారులను దూరంగా ఉంచాలి. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఇంటి తలుపులు మూసి వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలి. లేదా 101కు ఫోన్ చేయాలి. అగ్ని ప్రమాదం వల్ల అతిగా పొగ వెలువడి ఊపిరి అందదు. ఆ సమయంలో మంటల నుంచి తప్పించుకోవడానికి నేలమట్టానికి తాకుతూ బాధితులు ముందుకు వెళ్లాలి. దీనివల్ల ప్రమాద తీవ్రత నుంచి తప్పించుకోవచ్చు.

అజాగ్రత్తతోనే ప్రమాదాలు



వేసవి ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అజాగ్రత్తతోనే అగ్ని ప్రమాదాలు అధికంగా సంభవిస్తున్నాయి. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్, చుట్ట, బీడీ కాల్చేవారు వాటిని పూర్తిగా ఆర్పివేయాలి. కొందరి నిర్లక్ష్య ధోరణితోనే ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. **- ఎస్.నాగేశ్వరరావు, అగ్నిమాపక కేంద్రం అధికారి, రామచంద్రపురం**

వెంటనే సమాచారమివ్వాలి



అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో వెంటనే అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం ఇవ్వాలి. సరైన సమయంలో సమాచారం చేరవేస్తే ఆస్తి, ప్రాణ నష్టాన్ని తగ్గించడానికి వీలుంటుంది. ఇళ్లల్లో మహిళలు నిర్లక్ష్యంగా ఉండరాదు.

- జె.హనుమంతరావు, అగ్నిమాపక కేంద్రం అధికారి, మండపేట

ఖాతాదారులకు సేవల్లో ముందంజ



అవార్డులతో తపాలా శాఖ ఉద్యోగులు

మండపేట: ఖాతాదారులకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ద్వారా మండపేట సబ్ పోస్టాఫీస్‌కు పలు అవార్డులు దక్కాయి. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉభయగోదావరి జిల్లాల వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పోస్టల్ ఉద్యోగులకు రామచంద్రపురంలో బుధవారం రాత్రి అవార్డులు అందజేశారు. పదేళ్ల లోపు బాలికల ఆర్థిక భద్రతకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సుకన్య సమృద్ధి యోజన గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించడం ద్వారా ఎక్కువ మందితో అకౌంట్లు ఓపెన్ చేయించడంలో మండపేట సబ్ పోస్టాఫీసు ముందంజలో ఉంది. సబ్ పోస్టుమాస్టర్ ఎస్.శ్రీనివాసరెడ్డి ఉత్తమ పోస్టుమాస్టర్‌గా, డివిజన్ స్థాయిలో అత్యధిక అకౌంట్లు ఓపెన్ చేయించినందుకు పోస్టల్ అసిస్టెంట్ కొండపల్లి సూర్యనారాయణ, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ విభాగంలో వాసంశెట్టి గోవిందు, ఉత్తమ పోస్ట్ ఉమెన్‌గా సిద్దిరెడ్డి దుర్గాదేవి అవార్డులను అందుకున్నారు. గురువారం రిటైర్డ్ పోస్టుమాస్టర్ టపా పుల్లేశ్వరరావు అధ్యక్షతన స్థానిక పోస్టాఫీసులో అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ అసిస్టెంట్ కొండపల్లి సూర్యనారాయణ ఒకేరోజు వంద సుకన్య సమృద్ధి యోజన అకౌంట్లు తెరిపించడం ద్వారా పోస్టల్ శాఖలో అరుదైన ఘనత సాధించారన్నారు. పోస్టల్ ఉద్యోగులు ఎండీఎం షరీఫ్, కె.ఈశ్వరరావు, క్లబ్ కార్యదర్శి జి.వెంకట్రావు చెల్లుబోయిన శ్రీనివాస్, ఎం.అనూష, కె.అనూష, హైకోర్టు అడ్వకేట్ టీవీ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ నాగరాజు

కె.గంగవరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో నాణ్యమైన విద్య అందించాలని ఎంఈఓ ఎ.నాగరాజు సూచించారు. మండలంలోని కుందూరు ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. తొలుత పాఠశాల రికార్డుల పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించి విద్యార్థుల రాత పుస్తకాల చూసి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసిందని ఇప్పటికే పలు పథకాలను ప్రవేశపెట్టి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చిందన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



సమావేశంలో కన్వీనర్లు, గృహసారథులకు సూచనలిస్తున్న సత్యనారాయణ

కె.గంగవరం: సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కె.గంగవరం సచివాలయ పరిశీలకుడు టేకుమూడి సత్యనారాయణ అన్నారు. మండలంలోని కె.గంగవరం సచివాలయం వద్ద సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కరోనా లాంటి కష్టకాలంలో కూడా నవరత్న పథకాలను అమలు చేసి ప్రజలను ఆర్థికంగా ఆదుకున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందన్నారు. వలంటీర్లను భాగస్వాములుగా చేసుకుని రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. రాజానగరం పార్టీ పరిశీలకుడు, మాజీ ఎంపీపీ వట్టికూటి రాజశేఖర్, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ కోటి లక్ష్మీనరసమ్మ, సొసైటీ అధ్యక్షుడు ఈదర రమేష్, బీసీ నాయకులు పంపన సుబ్బారావు, గ్రామ పెద్దలు కోటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి ఆలయానికి శంకుస్థాపన



ఆలయ పునర్నిర్మాణానికి ప్రత్యేక పూజలు చేస్తున్న సర్పంచ్ అన్నపూర్ణ తదితరులు

కె.గంగవరం: మండలంలోని మసకపల్లిలో పార్వతీ, భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి గురువారం సర్పంచ్ పిల్లి అన్నపూర్ణతో పాటు పలువురు గ్రామ పెద్దలు వేద పండితుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. గ్రామంలోని ఆలయం శిథిలావస్థకు చేరడంతో విషయాన్ని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ దృష్టికి తీసుకువెళ్లామని వెంటనే ఆయన సీజీఎఫ్ నిధుల నుంచి రూ.కోటి మంజూరు చేయించారని సర్పంచ్ తెలిపారు. ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన మంత్రి చెల్లుబోయిన వేణుకు సర్పంచ్ అన్నపూర్ణ, గ్రామ పెద్దలు పిల్లి కల్యాణ్, కాదా గోవిందు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీలు కొప్పిశెట్టి లక్ష్మణ్, పిల్లి దుర్గాప్రసాద్, సర్పంచ్‌లు పిల్లి రాంబాబు, కొప్పిశెట్టి రమణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యతోనే మహిళాభివృద్ధి



అవగాహన ర్యాలీలో సీనియర్ సివిల్ జడ్జి మాధవీదేవి తదితరులు

రామచంద్రపురం: మహిళలు అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉన్నారని విద్య ద్వారానే జీవితాలను అభివృద్ధి చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, లోక్‌అదాలత్ చైర్మన్ కె.మాధవీదేవి అన్నారు. మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని లేడీస్ హాస్టల్‌లో న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగంలో మహిళా హక్కులు, బాధ్యతలను పొందుపర్చారని వాటిని ప్రతి మహిళా అవగాహన చేసుకోవాలని సూచించారు. తొలుత హాస్టల్‌లో గదులను విద్యార్థులకు ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలను పరిశీలించి వారిని అడిగి తెలుసుకున్నారు. ప్యానెల్ అడ్వకేట్ దొమ్మలపాటి సత్యనారాయణ, హాస్టల్ వార్డెన్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ ర్యాలీ

రాయవరం: రాయవరంలో గురువారం మహిళా దినోత్సవ ర్యాలీ జరిగింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి వైఎస్ రాజశేఖరరెడ్డి సర్కిల్ వరకూ అంగన్‌వాడీ, ఆశ, మిడ్ డే మీల్స్ వర్కర్లు ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా పెరిగిన గ్యాస్ ధరలను తగ్గించాలని, మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టి, దోషులను కఠినంగా శిక్షించాలని, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, లింగ వివక్ష లేకుండా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబుకు అందజేశారు.

సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.బలరామ్, మండల కన్వీనర్ డి.ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నేత ఎస్.కృష్ణకుమారి, ఆశ వర్కర్ల యూనియన్ మండల కార్యదర్శి జి.దుర్గ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్



బాపనయ్యచెరువులో మంగాయమ్మకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ అలేఖ్య

రామచంద్రపురం రూరల్: నెలపర్తిపాడు, బాపనయ్యచెరువు గ్రామాల్లో ద్రాక్షారామ పీహెచ్‌సీ వైద్యురాలు పి.అలేఖ్య ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. 226 మందికి వైద్య సేవలు అందించారు. బీపీ, సుగర్ వంటి దీర్ఘకాలిక రోగాలతో సతమతమవుతున్న వారికి నెలకు సరిపడా మందులు అందజేశారు. మంచానికే పరిమితమైన రోగుల వద్దకు వెళ్లి సేవలు అందించారు. హెల్త్ సూపర్‌వైజర్ గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగులను తరిమేద్దాం

- 14న జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమం
- 3,57,563 మందికి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



అంగరలో హైస్కూల్ విద్యార్థితో మాత్రను మింగిస్తున్న సర్పంచ్ కోటేశ్వరరావు (ఫైల్)

కపిలేశ్వరపురం: తిన్న ఆహారం ఒంటికి పట్టాలంటే జీర్ణ వ్యవస్థ బాగుండాలి. పొట్టలో నులి పురుగులు ఉంటే తిన్న ఆహారం ఒంట పట్టదు. ఈ పురుగుల ప్రభావంతో రక్తహీనత వచ్చి శరీరంలో వ్యాధి నిరోధక శక్తి క్షీణిస్తుంది. ఆరోగ్య సంరక్షణకు నులి పురుగులను నివారించాల్సిందే. దీనికోసం 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలు, కిశోర బాలలకు 400 మిల్లీ గ్రాముల ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 14, 18 తేదీలలో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై ఉన్నతాధికారులు ప్రభుత్వ ఆసుపత్రుల అధికారులకు దిశానిర్దేశం చేశారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని ఆరు మండలాల పరిధిలో 120 గ్రామాలు ఉన్నాయి. ఇక్కడ మొత్తం 16 పీహెచ్‌సీల ద్వారా 3,57,563 ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తుండగా 1,441 మంది సిబ్బంది సేవలందించనున్నారు.

పీహెచ్‌సీల వారీగా..

అంగర పీహెచ్‌సీ పరిధిలో 20,175 ఆల్బెండజోల్ మాత్రలను 90 మంది సిబ్బంది, వాకతిప్ప పీహెచ్‌సీ పరిధిలో 16,216 మాత్రలను 72 మంది, అచ్యుతాపురంలో 17,109 మాత్రలను 74, ద్వారపూడిలో 44,904 మాత్రలను 215, కేశవరంలో 22,784 మాత్రలను 47, రాయవరంలో 26,390 మాత్రలను 60, మాచవరంలో 19 వేల మాత్రలను 160, గొల్లపాలెంలో 29,572 మాత్రలను 125, దుగ్గుదూరులో 29,843 మాత్రలను 140, ద్రాక్షారామలో 32 వేల మాత్రలను 50 మంది, వెల్లలో 23,452 మాత్రలను 86, పామర్రులో 21,300 మాత్రలను 102, దంగేరులో 16,236 మాత్రలను 32, శేరిలంకలో 1,200 మాత్రలను ఐదుగురు సిబ్బంది, పేకేరులో 17,130 మాత్రలను 100, కుందూరు పీహెచ్‌సీ పరిధిలో 20,252 మాత్రలను 83 మంది సిబ్బంది పంపిణీ చేయనున్నారు. గర్భిణులు, తీవ్రమైన అనారోగ్యానికి గురైన వారు, రెండేళ్ల లోపు వయసు గలవారు ఆల్బెండజోల్, డీఈసీ మాత్రలను వేసుకోకూడదు. ఈ నెల 14న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం జాబితాలో ఉన్న 1 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలు, కిశోర బాలలకు మాత్రలను పంపిణీ చేసి మింగిస్తారు. కార్యక్రమం పరిధిలో లేని పిల్లలకు 18న మాప్ యాప్ పేరుతో మాత్రలను పంపిణీ చేస్తారు.

ఆల్బెండజోల్ సురక్షితం



ఆల్బెండజోల్ మాత్ర చాలా సురక్షితమైంది. నులిపురుగుల ప్రభావం ఉన్న పిల్లలకు మాత్ర వేసుకున్న తర్వాత కొద్దిగా వికారం, కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు లాంటివి కలిగే అవకాశం ఉంటుంది. అవి కొద్దిసేపటికి తగ్గిపోతాయి. కంగారు పడనక్కర్లేదు. అత్యవసరమైతే 104 నంబర్‌కు ఫోన్ చేయొచ్చు.

- బి.రామారావు, హెల్త్ ఎడ్యుకేటర్, అంగర పీహెచ్‌సీ

క్లుప్తంగా

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి



అంగరలో గర్భిణులకు సూచనలు చేస్తున్న వైద్యురాలు కన్యాకుమారి

కపిలేశ్వరపురం: ఎండల నేపథ్యంలో గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తగా పాటించాలని వైద్యురాలు కె.కన్యాకుమారి సూచించారు. అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి పర్యవేక్షణలో గురువారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా 36 మంది గర్భిణులను పరీక్షించారు. ఇందులో 9 మందిని హైరిస్క్‌గా గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణకు సూచించారు. గర్భిణులు, వారి సహాయకులకు ఆరోగ్య విధానాలపై హెచ్‌ఈ బి.రామారావు వివరించారు. కన్యాకుమారి మాట్లాడుతూ గర్భిణులు తప్పనిసరిగా పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఎంపీహెచ్‌ఎస్‌లు సురేష్, టి.మేరీమణి, స్టాఫ్ నర్సు జి.నవ్య తదితరులు పాల్గొన్నారు.

శివారు భూములకు సాగునీరందించాలి

కాజులూరు: శివారు భూములకు సాగునీరందించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకుడు, మండల వైఎస్సార్ సీపీ తెలగా కాపు సంఘం కార్యదర్శి తలాటం వీరన్న తదితరులు డిమాండ్ చేశారు. గురువారం కాజులూరులో రైతులు విలేకరులతో మాట్లాడుతూ గోదావరిలో తలెత్తిన నీటి ఎద్దడి నేపథ్యంలో తూర్పుడెల్టా కాలువ శివారు భూముల్లో ఉన్న కాజులూరు మండల గ్రామాలకు తీవ్ర సాగునీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. ముఖ్యంగా చేదువాడ మీదుగా కాజులూరుకు వచ్చే ఒకటో నెంబర్ కాలువ, అండ్రంగి, దుగ్గుదుర్రుల మీదుగా వచ్చే కాలువలపై శివారు భూములకు చుక్కనీరు రావటం లేదన్నారు. అధికారులు సాగునీటి సరఫరాలో కాలువ శివారు భూముల పొలాలకు ప్రాధాన్యత నివ్వటంతో పాటు పత్యామ్నాయ చర్యలపైనా దృష్టి పెట్టాలన్నారు.

నేడు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



టేకిలో అభయాంజనేయస్వామి విగ్రహం

కపిలేశ్వరపురం: టేకి ప్రధాన రహదారిలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కొత్తగా ఏర్పాటు చేసిన అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం జరుగనుంది. ప్రతిష్ఠ పూజల అనంతరం అన్న సమారాధన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు

రామచంద్రపురం: ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ పెన్షనర్స్ సమాఖ్య సంఘం నాయకులు ఆధ్వర్యంలో గురువారం ఆర్డీవో, ట్రెజరీ కార్యాలయాల్లో వినతిపత్రాలను అందజేశారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు బకాయిపడ్డ డీఏ, డీఆర్‌లను విడుదల చేస్తూ వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలని సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పట్నాల రామకృష్ణరావు, తటవర్తి రాఘవరావు కోరారు. ఈ మేరకు ఆర్డీవో, ట్రెజరీ కార్యాలయాల్లో ఏఓలకు వినతి పత్రాలను అందించామన్నారు. కోశాధికారి పీవీఎస్ ప్రసాద్, ఎ.సత్యనారాయణ, సీహెచ్ రామమూర్తి, పి.త్రినాథరావు పాల్గొన్నారు.

బీజేపీని పటిష్టం చేయాలి

కాజులూరు: వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి బీజేపీని సంస్థాగతంగా పటిష్టపరిచేలా కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు సలాది వీరబాబు అన్నారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి వీరబ్రహ్మం అధ్యక్షతన కాజులూరులో పార్టీ సీనియర్ నాయకుడు బండారు సత్యనారాయణ ఇంటి వద్ద గురువారం మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వీరబాబు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో కేంద్ర ప్రభుత్వంతో పాటు బీజేపీ పాలనలోని ఉత్తరాది రాష్ట్రాలు ఎంతగానో అభివృద్ధి చెందాయన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలోనూ పూర్తి స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి 2024 సార్వత్రిక ఎన్నికల నాటికి రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చే విధంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పుణ్యమంతుల శివాజీ, సహాయ కార్యదర్శి పోలిశెట్టి శ్రీనివాస్, పార్టీ నాయకులు సలాది సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను కలసిన నేతలు



సీఎం జగన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న రాజుబాబు, ఎమ్మెల్సీ తోట, మాజీ ఎమ్మెల్యే బిక్కిన తదితరులు

మండపేట: తాడేపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గురువారం నియోజకవర్గానికి చెందిన నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జునచౌదరి, పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు, యువజన విభాగం నియోజకవర్గ కన్వీనర్ చోడే సత్యకృష్ణ, యువజన విభాగం నాయకుడు చోడే శ్రీకృష్ణ కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన యోగక్షేమాలను సీఎం జగన్ అడిగి తెలుసుకున్నారు. అధినేతకు రాజుబాబు జ్ఞాపికను అందజేశారు.

నేడు విద్యా పరిరక్షణ శత చండీ మహాయాగం

రామచంద్రపురం రూరల్: రాజారత్న హెల్త్‌కేర్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న అంబికపల్లి అగ్రహారం గ్రామంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో నేటి ఉదయం 6 గంటలకు 30 మంది వేద పండితుల నేతృత్వంలో విద్యా పరిరక్షణ శత చండీ మహాయాగం నిర్వహిస్తున్నట్లు ఏటీ ఏఎన్‌వీ రవిధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం 15 వ తేదీన ఉదయం 11 గంటలకు మహా అన్నదానం నిర్వహిస్తామన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పురుగు మందులతో అనర్థాలు



టేకిలో రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ రమేష్‌కుమార్

కపిలేశ్వరపురం: వరి సాగులో అధిక పురుగు మందుల వినియోగం అనర్థాలకు దారితీస్తుందని మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ అన్నారు. గురువారం టేకిలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది ఎండలు అధికంగా ఉన్నందున వరి పంట రక్షణ కోసం వ్యవసాయ అధికారులతో సమన్వయం చేసుకుంటూ సాగును పూర్తి చేయాలని సూచించారు. ఎర్రనల్లి ఎక్కువగా ఉన్న పంటకు డైకోఫాల్ మందును లీటరు నీటిలో 5 ఎంఎల్ చొప్పున లేదా వెట్టబుల్ సల్ఫర్ మందును లీటరు నీటిలో 3 గ్రాముల చొప్పున తయారు చేసిన మిశ్రమాన్ని స్ప్రే చేయాలన్నారు. వ్యవసాయ సహాయకుడు గంజా హరిబాబు, రైతులు పాల్గొన్నారు.

రేపు రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం

మండపేట: మండపేట రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం 11న జరుగుతుందని సంఘ కార్యదర్శి పెంకే గోవిందరావు తెలిపారు. స్థానిక రామహింద మున్సిపల్ స్కూల్‌లో సంఘ అధ్యక్షుడు దేవళ్ల సత్యనారాయణ అధ్యక్షతన శనివారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సమావేశంలో ఇన్‌కం ట్యాక్స్, ఈకేవైసీ, లైఫ్ సర్టిఫికెట్ తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. సభ్యులంతా హాజరు కావాలని గోవిందరావు గురువారం ఓ ప్రకటనలో కోరారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

రామచంద్రపురం రూరల్: ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ద్రాక్షారామ పీహెచ్‌సీ వైద్యుడు సందీప్‌నాయుడు గురువారం 38 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వారిలో 13 మందిని హైరిస్క్ కేసులుగా గుర్తించి రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి సిఫారసు చేశారు. గర్భిణులకు పోషకాహారం, ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌వీ వరలక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రీసర్వే త్వరితగతిన పూర్తి చేయండి



అంగరలో మండల అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం

కపిలేశ్వరపురం: జగనన్న శాశ్వత భూహక్కు పథకంలో భాగంగా క్షేత్ర స్థాయిలో చేపట్టిన భూ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని రామచంద్రపురం ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం మండల అధికారులను ఆదేశించారు. గురువారం అంగరలోని రైతు భరోసా కేంద్రంలో మండల అధికారులతో భూసర్వేపై ఆమె సమీక్షించారు. సర్వే వివరాలను తహసీల్దార్ కొమరం సూర్యారావు, సర్వే విభాగం డిప్యూటీ తహసీల్దార్ శ్రీరాం, మండల సర్వేయర్ కె.నాగేశ్వరరావు వివరించారు. సర్వే పారదర్శకంగా, వివాద రహితంగా ఉండాలన్నారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులపై రైతులతో ఎప్పటికప్పుడు చర్చించాలన్నారు. లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పలు గ్రామాల వీఆర్వోలు పెద్దింశెట్టి నాగమణి, అల్లాడి మల్లేశ్వరరావు, జాను, గ్రామ సర్వేయర్లు, రెవెన్యూ, ఆర్బీకే సిబ్బంది ఉన్నారు.